● కథానిక

# తప్పెవరిది?

డి. కామేశ్వరి


ఈ చదువుల పోటీలు, నిరుద్యోగ పర్వాలు, విద్యా వ్యాపారాలు ఆగాలంటే తల్లిదండ్రులేం చేయాలి?


తెల్లారి నాల్గు గంటలకి అలారం మోగింది. విజయ బద్ధకంగా చేయిచాచి అలారం నోరు నొక్కింది. 'ఏమండీ, వంశీని కాస్త లేపుదురూ' మత్తులోంచి అంది.

'అబ్బ నీవు లేపు. నేనెలాగో ఐదున్నరికి లేవాలి. ఓ గంటయినా పడుకోనీ నన్ను' విసుగ్గా అటు తిరిగిపోయాడు శేషగిరి.

ఇంక తప్పదన్నట్టు విజయ లేచి కొడుకు గదిలోకి నడిచింది. "వంశీ, లేవరా. నాల్గు అయింది... లే... లే...' తట్టిలేపింది. వంశి ఘాడ నిద్ర లోంచి ఉలిక్కిపడి లేచాడు. కళ్లు బలవంతాన విప్పి 'నిద్రొస్తుంది అమ్మా... ప్లీజ్ కాసేపు పడుకో. నీయి, నేనివాళ లేవను, ఐదుకి లేపు" ముసుగు బిగించాడు. విజయ కోపంగా దుప్పటి లాగింది. "అబ్బబ్బ, ఏమిట్రా రోజూ గోల, లే ముందు, లేచే వరకు బద్ధకంగా వుంటుంది. వెళ్ళి మొహం కడుక్కునిరా టీ చేసి యిస్తాను." కుదిపి కుదిపి కూర్చోపెట్టింది. గ్లాసులో నీళ్లు చేతిలోకి తీసుకుని కళ్ళు తుడిచింది. 'ప్లీజ్ అమ్మా, నీకు దండం పెడతాను. రేపు చదువుతాను, యివాళకి వదిలేయి' మళ్లీ మంచం మీదకి వరిగాడు. "ఆం ప్రాణం తింటున్నావురా బాబూ, నీ చదువు కాదుగాని, చచ్చేబాధగా వుంది నాకు. అలారం పెట్టినా ఆపేసి పడుకుంటున్నావని నేను వచ్చి లేపినా గోలే నీతో, ప్రతిరోజూ యిదే గోల, చదవకపోతే ఎలా, లే ముందు, బాత్‌రూమ్‌కి వెళ్లిరా...' అరిచింది. పక్క గదిలోంచి 'వంశీ లే' అంటూ శేషగిరి అరవటంతో ఏడుపు మొహంతో లేచి విసవిస బాత్‌రూంలోకి వెళ్ళాడు.

ఇంటర్ సెకండియర్ చదువుతున్న వంశికి మొన్న పదిహేడు వచ్చింది. పరీక్షలు యింకా రెండు నెలలు వున్నాయి. ఇంటర్ మొదటి సంవత్సరం నుంచే ఎమ్‌సెట్ కోచింగ్ యిచ్చే కాలేజీలో చదవడం ఆరంభించాడు. ఆ కాలేజీ రెండున్నరకి అయ్యాక, ఎమ్‌సెట్ కోచింగ్ సాయంత్రం నాలుగున్నర వరకు వుంటుంది. ఎమ్‌సెట్ కోచింగ్ ముందునించి ఆరంభించి ఇంటర్ రెండో సంవత్సరం పూర్తి అవుతుంది. వంశీ లెక్కల్లో, సైన్స్‌లో వీక్‌గా వున్నాడని ట్యూషన్ పెట్టించారు. ఆ లెక్కల ట్యూషన్ కోసం ఉదయం ఫస్ట్ బ్యాచ్‌కి 6 గంటలకల్లా వెళ్లాలి. ఆ లెక్కల టీచర్ ఎంత బిజి అంటే ఉదయం ఆరు నించి ఏడు ఒక బ్యాచ్, ఏడు నించి ఎనిమిది వరకు రెండవ బ్యాచ్, మళ్ళీ సాయంత్రం ఆరునించి ఎనిమిది వరకు రెండు బ్యాచ్‌లు. ఆయన లెక్కల లెక్చరర్‌గా రిటైర్ అయ్యాక ఆయన సంపాదన మరింతలు పెరిగింది. ప్రైవేట్ సంపాదన కాక రెండు ఎమ్‌సెట్ కోచింగ్ కాలేజీలు పోటీపడి ఓ గంట పాఠం చెప్పడానికి ఏడాదికి లక్షయిచ్చి కారు యింటికి పంపిదింపుతారు. ఆయన లెక్కల్లో దిట్ట. పిల్లలకి అర్ధం అయ్యేట్టు చెప్తాడని, స్ట్రిక్ట్ అని పేరుంది. ఉదయం ఎమ్‌సెట్ వారికి, సాయంత్రం ఐ.ఐ.టి. వారికి ట్యూషన్స్ చెప్తతాడు. వీధికో కోచింగ్ సెంటర్, వీధికో ప్రైవేట్ కాలేజీలు వచ్చి తల్లిదండ్రులకి ఎమ్‌సెట్ పిచ్చి ముదిరాక లెక్కలు, సైన్స్ టీచర్ల పంట పండింది. ఉదయం బ్యాచ్ ట్యూషన్‌కి వెళ్ళాలంటే పిల్లలు ఐదు గంటలకి లేచి తయారై వెళ్లాలి. దూరమయితే తండ్రి ఏ స్కూటరు మీదో దింపి రావాలి. ఆయనిచ్చిన లెక్కలు ఏ రోజువి ఆరోజు చేసి చూపకపోతే ఆ రోజు క్లాస్‌లోంచి పంపేస్తారు. అంచేత వంశీని నాల్గు గంటల కల్లా లేపి కూర్చోపెట్టి హోం వర్క్ చేయించాలి. ఇంటర్ చదువుతున్న వంశీకి రోజుకి ఇరవై నాల్గు గంటల్లో ఆరేడు గంటలు నిద్రలో మినహా విశ్రాంతి లేదు.



ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 1997 దీపావళి ప్రత్యేక సంచిక

విజయ, శేషగిరి కొడుకు కోసం టైం టేబుల్ తయారు చేశారు. ఉదయం నాల్గునించి ఐదు లెక్కల హోం వర్క్. ఆరు నుంచి ఏడు వరకు లెక్కల ట్యూషన్, ఏడు నించి ఎనిమిది వరకు ఇంకో లెక్చరర్ దగ్గర ఫిజిక్స్, కెమిస్ట్రీ ట్యూషన్, అప్పుడు యింటికి వచ్చి తయారై, తిని కాలేజీకి వెళ్లాలి. తొమ్మిదినించి రెండు వరకు కాలేజీ– రెండున్నర నించి నాలుగున్నర వరకు కాలేజీలో ఎమ్‌సెట్ కోచింగ్. యింటికి వచ్చి ఓ గంట రిలాక్స్ అయి రిఫ్రెష్ అయి ఏడు నించి తొమ్మిది వరకు కాలేజీ పాఠాలు చదవాలి. తొమ్మిదిన్నరకి నిద్రపోయి నాల్గు గంటలకి లేవాలి.

టీ చేసి తీసుకువచ్చి వంశీకిచ్చి, కొడుకు టేబిల్ దగ్గర కూర్చోడం చూసి ఓ గంట పడుకోవచ్చు అనుకుంటూ వెళ్లింది విజయ. ఐదు వరకు చదివి, కాలకృత్యాలు తీర్చుకొని తల్లి యిచ్చిన పాలు, ఎగ్ తిని ట్యూషన్‌కి వెడతాడు వంశి. ఐదున్నరకి లేచి రెండు మైళ్ల దూరంలో వున్న ట్యూషన్‌కి కొడుకుని దింపివస్తాడు శేషగిరి. గత ఏణ్ణార్థం నించి ఓ తపస్సులా యింజనీరింగ్ సీటు కోసం కొడుకుతో పాటు తల్లితండ్రులూ కష్టపడ్తున్నారు.

వాళ్ల పెద్దకొడుకు వరుణ్ వంశీ కంటే రెండేళ్లు పెద్ద. రెండేళ్ల క్రితం ఐ.ఐ.టి. పరీక్షలో మంచి ర్యాంక్ సంపాదించి ఖరగ్‌పూర్‌లో కంప్యూటర్ ఇంజనీరింగ్ చదువుతున్నాడు. స్వతహాగా చాలా తెలివైన వాడు, దానితో పాటు కృషి, తల్లిదండ్రు లిచ్చిన సదుపాయాలు వినియోగించుకుని కష్టపడి సీటు సంపాదించుకున్నాడు. వరుణ్‌తో పోలిస్తే వంశీకి తెలివితేటలూ తక్కువే. పట్టుదల, శ్రద్ధ తక్కువే. "వరుణ్‌తో మనకేం ప్రాబ్లమ్ లేకపో యింది. వీడిని ప్రతిక్షణం చదువు చదువు అని చెప్పాల్సి వస్తుంది. వీడికి అసలు చదువుమీద శ్రద్ధ లేదు. ఈ కాంపిటీషన్ యుగంలో చదవ కపోతే వీడెందుకు పనికివస్తాడు" అన్న చింత పట్టుకుంది విజయ, శేషగిరిలకి. శేషగిరిరావు ఓ కంపెనీలో ఇంజనీరు. విజయ బ్యాంకి ఉద్యో గిని. దేనికి లోటులేని సంసారం. పిల్లలిద్దరికి మంచి చదువులు చెప్పించడమే తామీయగల్గిన ఆస్తి అని నమ్మే మధ్య తరగతి సంసారులు. పిల్లలకి అన్ని వసతులు కల్పించి, మంచి చదువులు చదివించితే వాళ్ళ భవిష్యత్ గురించి చింత వుండదన్న నమ్మకం. డొనేషన్స్ యిచ్చి సీట్లు కొనే తాహతు లేదు కనుక పిల్లలు కష్టపడి చదవాలి. సీటు తెచ్చుకోవాలి అని మెట్రిక్ నించి పిల్లల చదువు మీదే ధ్యాస, దృష్టి నిలిపి సినిమాలు, షికార్లు, శలవుల్లో వూర్లు అన్ని ఖర్చులు త్యాగాలు చేసి డబ్బు ఖర్చు అనుకోకుండా అడిగిన సబ్జ క్టుకి ట్యూషన్స్ పెట్టించి, పేపర్లు, పుస్తకాలు ఏవి కావాలన్నా కొనియిచ్చి పిల్లల బంగారు భవిష్యత్‌కి బంగారు బాట వెయ్యాలని తాపత్రయపడుతున్న వందలు, వేలు తల్లిదండ్రులలో వారూ ఒకరు.

ఇంటర్ అయి ఎమ్‌సెట్‌లో సీటు వచ్చేస్తే నిశ్చింగా ఊపిరి పీల్చుకోవచ్చని వారి ఆశ. ఎమ్‌సెట్‌లో మంచి ర్యాంక్ రాకపోతే మంచి సబ్జక్ట్‌లో సీటు దొరకదు. డబ్బు కట్టి చదివించడం తాహతుకు మించినదవుతుంది అని రాత్రింబగళ్లు చదవమని పోరుతుంటారు.

తల్లిదండ్రుల ఆలోచనలు అలా వుంటే యిటు వంశీకి చిన్నతనం నించి 'చదువు' అన్నమాట వింటుంటే ఎలర్జీ పట్టుకుంది. ఇంట్లో వరుణ్ ఎప్పుడూ చదువుతూనే వుండేవాడు. క్రికెట్ ఆడ దామన్నా వచ్చేవాడు కాదు. వంశీకి ఆటలంటే అందులో క్రికెట్ అంటే పిచ్చి. టి.వి. చూడడం,



కామిక్కులు చదవడం ఇష్టం. ఒకటో క్లాస్ నించి కూడా తల్లి తండ్రి 'చదువు' చదువు అనడం తప్ప మరోమాట వినలేదనుకుంటారు. కాసేపు కూర్చుంటే 'ఏమిటిరా చదువుకోకూడదూ, నీకెం తసేపూ ఆటలే' అనేది తల్లి. 'డోన్ట్ వేస్ట్ యువర్

టైమ్, పరీక్షల ముందు చదివితే చాలనుకోవడం సరియయిన పద్ధతి కాదు' అనేవాడు తండ్రి. ఒకటో క్లాస్ నుంచి ట్యూషన్. స్కూలు నుంచి వస్తూనే పక్కింటి ఆంటీ దగ్గర ట్యూషన్‌కి వెళ్ళాలంటే ఏడుపు వచ్చేది. 'ఛా – కాసేపు ఆడుకోనియ్యరు' అని తిట్టుకునేవాడు. ట్యూషన్ నుంచి వచ్చేసరికి తల్లి ఆఫీసు నుంచి వచ్చి టి.వి. ముందున్న వంశీని చూసి 'పుస్తకాలు తీయి, లెక్కలు చేయి, క్వశ్చన్ ఆన్సర్లు చదువు – ' అంటూ ఊదరగొట్టేది. ఆదివారం పొద్దుటయినా ఏ క్రికెట్ మ్యాచ్‌కో వెడతానంటే క్రిమినల్‌లా చూసేవారు. ఆదివారం యిద్దరూ యింట్లో వుండేరోజేమో పిల్లల చదువుల పర్యవేక్షణ జరిగేది యింట్లో. ఒక్క ఆదివారం సాయంత్రం తప్ప మిగతా టైమంతా చదువు అన్న మాట విని వంశీకి కోపం, ఉక్రోషం వచ్చేది. 'ఛ వెధవ చదువు. నే చదవను. పరీక్ష తప్పి తల్లిని తండ్రిని ఏడ్పించాలన్నంత కసిగా వుండేది. ఆరేడు క్లాసులలో అరవై, డెబ్బై మార్కులు చూసి "నీకిప్పుడే అరవైలయితే మెట్రిక్, యింటరులో ఏం చేస్తావు. నీకసలు చదువుమీద ధ్యాస వుంటేగా" అని తిట్టేవారు. 'అన్నయ్య చదివితే నే చదవాలా. వాడో పుస్తకాల పురుగు, వాడికి లెక్కలు బాగా వస్తే నాకు రావాలా. వీళ్ళకి ఎలా బుద్ధిచెప్పాలో నాకు తెలుసు' పన్నెండేళ్ళ వంశీ కసిగా తిట్టుకునేవాడు.

మెట్రిక్‌కు వచ్చేసరికి ఫ్రెండ్స్ అందరూ బాగా చదవాలని, ర్యాంకులు తెచ్చుకోవాలని పోటీలు పడడం చూసి, పదిహేనేళ్ళ వంశీ ఆలోచనల్లో కాస్త పరిణితి వచ్చి, కాస్త చదువు మీద శ్రద్ధపెట్టాడు. కాని చదివింది మర్చిపోయేవాడు. అందుకే లెక్కలు అసలు బుర్రకెక్కేవి కావు – లెక్కల్లో ఏభై అరవైలు వస్తే నేరస్తుడిని చూసినట్టు చూసేవారు. 'నాకు లెక్కలు రావు... రావు... అంటే ఎమ్.పి.సి. గ్రూపు తీసుకోనంటావేమిటి.' ఇంటర్‌లో సైన్స్ గ్రూప్ చదవనని మొండికేశాడు వంశీ. "ఆర్ట్స్ తీసుకుని ఏం చేస్తావురా. లెక్కలు రాకపోతే ట్యూషన్ పెట్టిస్తాం, యీ కాలేజీలో చదువుతో పాటు ఎమ్‌సెట్ కోచింగ్ కూడా ఇస్తారు. నీవు మనసుపెట్టి చదివితే ఎందుకు రావు లెక్కలు" అని యిద్దరు అదరగొట్టారు. 'అన్నయ్యకి లెక్కలు వస్తే నాకూ రావాలా – వాడు ఇంజనీరింగ్ చేస్తే నేనూ అదే చదవాలా. నాకు లెక్కలు యిష్టం లేదు. నేను ఆర్ట్స్ చదువుతాను. ఇంజనీరింగ్ తప్ప యింకేం చదువులు లేవా. లక్ష రకాల కోర్సులున్నాయి. లక్ష ఉద్యోగ ఛాన్సులున్నాయి. నాకు ఇంటరెస్ట్ లేని చదువులు చదవమనద్దు' వాదించాడు వంశీ.

"చూడరా, నీకు చిన్నతనం – యిప్పుడు అర్థం కాదు చెపితే. బి.ఏ., ఎమ్మే చదివి ఏం చేద్దామని.." తల్లి అనునయించింది.

"ఏం, బ్యాంకు పరీక్షలున్నాయి – సివిల్ సర్వీస్ ఎగ్జామ్స్, అనేక కాంపిటీటివ్ ఎగ్జామ్స్ వున్నాయి. హోటల్ మేనేజ్‌మెంట్, కేటరింగ్, ఎమ్‌బిఏ ఎన్నో వున్నాయి కోర్సులు."


"చూడు వంశీ, ఆర్ట్స్ తీసుకుంటే నీ భవిష్యత్తు ఎలా రూపుదిద్దుకుంటుందో ఆఖరువరకు అర్థం కాదు. సివిల్ సర్వీసెస్ అవి మాత్రం సులువా. వాటికీ చదవాలి. వెళ్ళిన అందరికీ వచ్చేస్తుందా. రాకపోతే నీ బి.ఏ, ఎమ్మేతో ఏం చేస్తావు. ఎమ్‌సెట్ అయితే ఇంటరు తర్వాత ఏ లైన్‌లోకి వెడతావో ఖచ్చితంగా తెలిసి నిశ్చింతగా వుంటుంది. నీ మంచి కోసమే చెప్తున్నాం అర్థం చేసుకో. పోనీ ఐ.ఐ.టికి నీ కెపాసిటీ సరిపోదని మాకూ అర్థం అయింది. అందుకే ఎమ్‌సెట్ ప్రిపేర్ అవమంటున్నాం..."

"ఎమ్‌సెట్ రాకపోతే ఏం చేస్తారు. ఇదిగో ముందే చెపుతున్నా, నాకు రాదు, తర్వాత నన్ననొద్దు, డిసప్పాయింట్ అవద్దు" వంశీ కోపంగా అన్నాడు.

"రాదు, రాదు అంటే ఏది రాదు. మనసుంటే మార్గం వుంటుంది. దేనికన్నా పట్టుదల వుండాలి. రెండేళ్ళు కోచింగ్ వుంటుంది. ట్యూషన్స్ పెడతాం. కష్టపడి చదువు. రాకపోతే అప్పటి సంగతి ఆలోచిద్దాం" తండ్రి అన్నాడు అన్ని కోణాలనించి విశదీకరిస్తూ.

ఇంట్లో తల్లిదండ్రులు, ఎవరింటికి వెళ్ళినా ఫ్రెండ్స్ తల్లిదండ్రులు అందరూ తమ తమ పిల్లలను ఎమ్‌సెట్‌కి తయారు చేస్తూండడంతో, అందరి పెద్దవాళ్ళు యిలాగే వాదిస్తుండడంతో యింకో ఛాయిస్ లేదుకాబోలు అన్పించింది వంశీకి. తప్పక ఎమ్.పి.సి.లో చేరాడు. కోచింగ్‌లు, ట్యూషన్స్ మొదలయ్యాయి. ఫస్ట్ టరమ్‌లో లెక్కలు, ఫిజిక్స్‌లో మార్కులు తక్కువ రావడంతో తను చదవలేనన్న దిగులు పట్టుకుంది వంశీని. తల్లి తండ్రి కూడా దిగులుపడ్డారు. వాడన్నట్టు వాడికి లెక్కలు రావు గాబోలు అన్న చింత పట్టుకుంది. దాంతో యింకా చదువు చదువు అన్న మాట ఎక్కువైంది. ప్రయివేట్లో రామ్మూర్తి మాస్టారు మరింత నూరసాగారు. రోజుకి ఏభై లెక్కలిచ్చి హోంవర్కు చేయమనేవాడు. కాలేజీ చదువు – కోచింగ్, ట్యూషన్స్, హోంవర్కులతో – నిమిషం తీరికలేక చదువంటే బెదురు పట్టుకుంది వంశీకి. కాస్త ఆఫ్‌యియర్‌లో యింప్రూవ్ అయినా అతను ఎంత మానసిక వత్తిడికి గురిఅవుతున్నది తల్లి తండ్రి గమనించలేకపోయారు. సరిగా నిద్రలేక, విపరీతమైన శారీరక, మానసిక శ్రమ, టెన్షన్‌తో, నీరసంగా, కళ్ళకింద నల్ల చారలతో మనిషి దిగాలుగా కన్పించసాగాడు. కొడుకు అలిసిపోతున్నాడని గుడ్లు, పాలు, కంప్లాన్లు యివ్వసాగింది విజయ.

'ఈ రెండేళ్ళు కష్టపడాలిరా నాయనా, నా ఆరాటం అర్థం చేసుకో, నీకోసమే యిదంతా" అనేది విజయ. వంశీలో చలాకితనం పోయి గంభీరత చోటుచేసుకుంది. మాటలు తగ్గించాడు. పుస్తకాలు ముందేసుకుని కూర్చుంటాడు గాని బుర్రలోకి ఏమి ఎక్కేది కాదు. మొదటి సంవత్సరం ఎలాగో అయింది. రెండో సంవత్సరం చదువు వత్తిడి మరింత పెరిగింది.... పుస్త చదువు కాక రకరకాల ట్యుటోరియల్ పేపర్లు ఆన్సరు చేయమనేవారు. తమలాంటి మధ్యతరగతి వాళ్ళు యీ కాంపిటీషన్ల యుగంలో, యీ రిజర్వేషన్ల దేశంలో చదవక తప్పదు అన్నది వంశీకి అర్థమైనా అంత చదువు అతని శక్తికి మించిందనిపించసాగింది. ఇంటరు పరీక్షలకి చదవాలి. అదవగానే ఎమ్‌సెట్ – కెసెట్ అవికాక యింకా రెండు మూడు ప్రైవేట్ యింజనీరింగ్ కాలేజీల ఎంట్రన్స్‌లు రాయాలి. ఒకదాన్లో కాకపోతే యింకో దాన్లోనైనా రావాలి అని నాలుగైదు పరీక్షలకు అప్లికేషన్స్ తెప్పించి నింపి పంపారు. యివన్నీ అవ్వాలంటేయింకా యిలా నాలుగైదు నెలలు చదవాలి. యింత చదువు నే చదవలేను, చదవలేను అని






కాక ఏ కేటరింగో, హోటల్ మేనేజ్‌మెంట్, టెక్స్‌టైలు డిజైనింగ్, ప్రింటింగ్ టెక్నాలజి లాంటి చదువులు మీ కంటికి ఆనవు. మీలాంటి తల్లిదండ్రులు అందరూ ఈ ఎమ్‌సెట్ పిచ్చిలో పడబట్టే, మా వీక్‌నెస్‌ని క్యాష్ చేసుకునేందుకు వీధినో కోచింగ్ సెంటర్లు వెలుస్తూ లక్షలార్జిస్తున్నాయి. పేపర్లు కొని విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్నారంటే మీలాంటి తల్లిదండ్రుల వేలంవెర్రివల్లే. కాలేజిలో సరిగా పాఠాలు చెపితే ఈ కోచింగ్‌లు ఎందుకు! ఇదివరకు ఇంజనీర్లు, డాక్టర్లు చేసినవారికి ఈ కోచింగులుండేవా! తెలివివున్నా లేకపోయినా అర్హత వున్నా లేకపోయినా ప్రతివాళ్ళు ఈ ఎమ్‌సెట్‌లకి ఎగబడి పిల్లలని వేలకివేలు ఖర్చుపెట్టి చదివించాలన్న ఈ పిచ్చివల్లే విద్య వ్యాపారం అయిపోయింది. ఇంజనీరింగు చదవకపోతే నాకు భవిష్యత్ లేదని మీ ఉద్దేశం. మీకోసం నా శక్తికి మించి ప్రయత్నించాను. కాని ఈ పరీక్షలు ఇలా ఔట్‌అయి నాశక్తిమీద నాకే నమ్మకం సడలింది. మళ్ళీ చదవాలి. ఆ పరీక్షలకి ముందు ఎమ్‌సెట్ రాయాలి. కె.సెట్. రాయాలి. ఇంకా రెండు కాలేజీల పరీక్షలు రాయాలి. ర్యాంకు రాకపోయినా అప్పోసప్పోచేసి ఏ ప్రైవేటు కాలేజిలోనో చదివిస్తారు. అక్కడ నాలుగేళ్ళు చదివి గట్టెక్కాలి. అదయ్యాక అమెరికా పాట మొదలుపెడ్తారు. జి.ఆర్.ఇ.లు, టోఫెల్ రాయాలి. అక్కడికి వెళ్ళి అంట్లుతోముకుంటూ రెండేళ్ళు ఎం.ఎస్. చదవాలి. ఇంకా వీలయితే ఇంకో రెండు మూడేళ్ళు చదివి డాక్టరేట్ తెచ్చుకోవాలి. నాకిదంతా తల్చుకుంటేనే వణుకు వస్తుంది. నేను చదవలేనమ్మా ఇంత చదువు. బతికుంటే చదువు చదువు అని చంపుతారు మీరు. చచ్చిపోతే ఇంకా చదువు అని చంపరుగా మీరు. అందుకే పారిపోతున్నాను.


అమ్మా, మీ కోరికలు, ఆశలు, కలలు తీర్చుకోవడానికి పిల్లల్ని బలిపశువులు చేయకండి. వాళ్ళు మోయలేని బరువు నెత్తిన ఎత్తి వాళ్ళని కృంగదీయకండి. విదేశాల్లో మాదిరి నిజంగా తెలివి, ఆ సబ్జెక్ట్ మీద ఇష్టంవుంటేనే చదువుతారు. ఎవరికి నచ్చింది వారు చదువుతారు. ఎవరి శక్తికి తగింది వాళ్ళెన్నుకుంటారు. ఏ చదువుకైనా నామోషి అనుకోరు. ఏ చిన్న ఉద్యోగమన్నా చేసి తమ కాళ్ళమీద తాము నిలబడే ప్రయత్నం చేస్తారు. మన తల్లిదండ్రుల ఆలోచనా విధానం మారాలి. అలాంటి ధోరణి అలవర్చుకుని పిల్లల ఇష్టాఇష్టాలు గమనించి ఆ లైనులో ప్రోత్సహించాలి. అప్పుడే ఈ చదువుల కాంపిటేషన్లు, ఈ నిరుద్యోగ పర్వాలు, విద్యని వ్యాపారంచేసే వారి ఆటలు ఆగుతాయి. నేనీ దేశంలో, అందులో ఆంధ్రదేశంలో పుట్టకుండా వుంటే ఇలా అర్ధాంతరంగాభయపడి జీవితం నించి పారిపోయే రోజు వచ్చేది గాదు.

నేనీ పని చెయ్యడానికి కారణం మీ అత్యాశా, నా అసమర్థతా, ఈనాటి విద్యావస్థ... తప్పెవరిది అన్న నా ప్రశ్నకి నాకు జవాబు దొరకలేదు. ఇది చూసైనా మీలాంటి తల్లిదండ్రులు తమ ఆలోచనా ధోరణి మార్చుకోవాల్సిన తరుణం వచ్చిందని గ్రహిస్తే అంతేచాలు– వంశీ"

"వంశీ", శేషగిరి, విజయల ఆక్రందన ఎంతమంది తల్లిదండ్రులకి వినిపించిందో మరి.

## మట్టిమనిషి

కాళ్ళకు అడ్డ పడ్తున్న ఆశల్ని
దారి పొడుగునా బుజ్జగిస్తూ వస్తాడు
తీగెలు సాగిన కన్నీళ్ళ మీద
రేపటి సూర్యోదయాల్ని పాడ్తూ వస్తాడు
సంక్షోభాన్ని భుజాన వేసుకుని
సరం తెగిన నాగలి ఒరం మీద పడినా
బావి కళ్ళ నిండా నీళ్ల చూసి
అతడి గుండెల్లో వాన కురుస్తుంది
పొలం నిండా కలల్ని చల్లుకుంటాడు
పొలం నిండా బతుకుని విత్తుకుంటాడు
భూమికి బురద చిత్రం గీసి
కలలకి కాలి బూడిదైన కరంటు మోటారు తీగెల పేగులు
అప్పుల కొమ్మకు మృత్యువై వేలాడ్తుంటాయ్
విత్తుకున్న బతుకు కుత్తుక పడ్తుంది
పొలాల్నిండా మొలకలెత్తిన గడ్డి మధ్య
అల లుగా చీకటి తలలూపుతుంటాయ్
పాప నాశనంలో స్నానించి వచ్చి
చచ్చిన చేను మీద రాజకీయం వాల్తుంది
ఎవరి చావులకు వారే బాధ్యులని పేల్తుంది
భూమిలో తల దాచుకున్న మట్టిమనిషి
మొలకల అకాల తలపండి రాలిన తనాన్ని చూసి
ఎండి గుండె పగిల్న భూమి చూసి
పొలం నిండా సవ్వాధె పుడతారు



— వజ్జిబోయిన శ్రీనివాస్